విద్యార్థులకు బుక్స్, బట్టలు పంపిణీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని పెద మైనవానిలంకలో దాత దేవేందర్ రావు సాయంతో పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు బుక్స్, పెన్సు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొని అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంఇఒ పి.పుష్పరాజ్యం, మైలా శివకుమార్, ఒడుగు ఏసుబాబు, బల్ల హనుమంతు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీటి కష్టాలు..!

ఆక్రమణలతో బక్క చిక్కిన బోదెలు
దమ్ములకు సైతం నీరు లేక ఎండుతున్న పొలాలు
కనీసం పూడికతీత చేపట్టాలంటున్న రైతులు

పెనుమంచిలిలో దమ్ములకు సైతం నీరు లేక ఎండుతున్న పొలాలు

ప్రజాశక్తి - ఆచంట

దాళ్వా ఆరంభంలోనే రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కాల్వ శివారు ప్రాంత భూములకు సాగునీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. చేలలో వరి మోడులు కుళ్లేందుకు వీలుగా సాలు దమ్ము చేయాల్సి ఉంది. అయితే పంట కాలువల్లో నీటిమట్టాలు పడిపోవడంతో దమ్ము చేసే పరిస్థితి కన్పించడం లేదు. పంట బోదెలు పూడుకుపోవడం, ప్రధాన కాలువ నుంచి పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో చేలు తడవని దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు ఆయిల్ ఇంజిన్లను అద్దెకు తెచ్చుకుని బోదెలోని నీటిని తోడి దమ్ము చేయాల్సిన పరిస్థితి కన్పిస్తోంది. కొన్నిచోట్ల డ్రెయిన్లపై అడ్డుకట్టలు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్నారు.

ఆచంట వేమవరం ఇసుక గురువులో పంట కాలువలో చెత్తాచెదారం

అడుగంటుతున్న పంట కాలువలు

ప్రధాన కాలువల నుంచి తగినంత నీరు విడుదల కాకపోవడంతో మండలంలోని జగ్గరాజు, కోడేరు కెనాల్, దేవ కాలువల్లో నీరు అడుగంటింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. దాళ్వా సీజన్ ప్రారంభంలోనే నీరందకపోతే పంట చేతికొచ్చే దశలో పరిస్థితి ఎలాగుంటుందోననే ఆందోళన రైతుల్లో నెలకొంది. కాల్వల ద్వారా శివారు భూములకు నీరు చేరేలా విధంగా బోదెల తవ్వకం పనులు చేపట్టాలని కోరుతున్నారు. అదే సమయంలో కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆచంట మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, శేషమ్మచెరువు, పెదమల్లం తదితర గ్రామాల పరిధిలో పంట బోదెలు, కాలువలు ఆక్రమణలతో నిండిపోయాయనే ఆరోపణలున్నాయి. దీంతో ఆయా గ్రామాల పరిధిలోని శివారు భూములకు సాగునీరు చేరడం కష్టంగా మారింది. వల్లూరు, దేవ, ఆచంట-2 ఛానల్, కందరవల్లి, భీమలాపురం ఛానల్, కొఠాలపర్రు ఛానల్, జగ్గరాజు ఛానల్, ఇలపర్రు ఛానల్, పోరా కాలువల పరిధిలో ఆయకట్టు రైతుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు పుష్కలంగా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.


కొడమంచిలిలో ఇంజన్ ద్వారా తోడుతున్న నీరు

నీటి కష్టాలు ఎలా అధిగమించాలి

జి.సూర్యనారాయణ, ఇసుక గురువు కౌలురైతు, ఆచంట వేమవరం

పంట కాల్వల శివారు భూములకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించుకోవాల్సి వస్తోంది. దీంతో అదనపు ఖర్చు తప్పడం లేదు. నీటి కష్టాలను ఎలా అధిగమించాలో అర్థం కావడం లేదు. కాలువల్లో చెత్తా చెదారం వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో శివారు భూములకు సాగునీరు అందక ఇంజిన్ల ద్వారా తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదనపు ఖర్చుతోపాటు అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది.

తాగు, సాగునీరు కలుషితం

సత్యనారాయణ, రైతు, ఆచంట వేమవరం ఇసుక గురువు

పంట కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోయింది. తాగునీటి చెరువులకు ఈ నీరే వస్తుంది. ఈ నేపథ్యంలో సాగు, తాగునీరు కలుషితమవుతోంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాలువల ప్రక్షాళన చేపట్టాలి.

మహిళా ఓటర్లే అత్యధికం

జిల్లాలో ఓటర్ల సంఖ్య 14,70,852
తుది ఓటర్ల జాబితా విడుదల చేసిన కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ-2025 ప్రక్రియ అనంతరం ఓటర్ల తుది జాబితాను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సోమవారం ప్రకటించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలు, తదితర కార్యాలయాల్లో ప్రచురించారు. జిల్లాలోని మొత్తం 1,461 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ప్రస్తుతం 14,70,852 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వీరిలో పురుష ఓటర్లు 7,20,597 మంది, మహిళలు 7,50,179గా నమోదయ్యారు. థర్డ్ జెండర్ 76 మంది ఉన్నారు. గతేడాది అక్టోబరు 29న ప్రచురించిన ముసాయిదా జాబితాలో 14,71,189 మంది ఓటర్లు ఉండగా సవరణల అనంతరం తుది జాబితా నాటికి సుమారు 337 మంది ఓటర్లు తగ్గారు. అత్యధికంగా భీమవరం నియోజకవర్గంలో 2,52,255 మంది ఓటర్లు ఉండగా, అతి తక్కువగా నరసాపురం నియోజక వర్గంలో 1,70,683 మంది ఉన్నారు. అలాగే సర్వీస్ ఓటర్లు జిల్లాలో మొత్తం 888 మంది ఉండగా వారిలో 868 మంది పురుషులు, 20 మంది స్త్రీలు ఉన్నారు. ఎప్పటిలాగే జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు.

ఏలూరు జిల్లాలో 16,37,555 మంది ఓటర్లు

పురుషులు 7,99,283,
మహిళలు 8,38,146 మంది

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025 షెడ్యూల్ ప్రకారం ఏలూరు జిల్లాకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్వి విడుదల చేశారు. నియోజకవర్గాలవారీగా మొత్తం ఓటర్లు, సర్వీసు ఓటర్ల వివరాలను అందులో పొందుపర్చారు. జిల్లాలో 16,37,555 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుష ఓటర్లు 7,99,283 మంది, మహిళా ఓటర్లు 8,38,146 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 126 మంది ఉన్నారన్నారు. వీరుగాక 678 మంది సర్వీసు ఓటర్లుగా నమోదై ఉన్నారన్నారు. జిల్లాలోని ఉంగుటూరు నియోజకవర్గంలో 1,01,586 మంది పురుష ఓటర్లు, 1,04,914 మంది మహిళా ఓటర్లు, ఆరుగురు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,06,506 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 193 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 1,09,181 మంది పురుష ఓటర్లు, 1,15,318 మంది మహిళా ఓటర్లు, ఎనిమిది మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,24,507 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 101 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు.

ఏలూరు నియోజకవర్గంలో 1,12,032 మంది పురుష ఓటర్లు, 1,22,447 మంది మహిళా ఓటర్లు, 47 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,34,526 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 115 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. పోలవరం (ఎస్‌టి) నియోజకవర్గంలో 1,22,961 మంది పురుష ఓటర్లు, 1,31,381 మంది మహిళా ఓటర్లు, తొమ్మిది మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,54,351 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 68 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. చింతలపూడి (ఎస్‌సి) నియోజకవర్గంలో 1,34,171 మంది పురుష ఓటర్లు, 1,38,705 మంది మహిళా ఓటర్లు, 41 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,72,917 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 72 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో 1,18,055 మంది పురుష ఓటర్లు, 1,20,868 మంది మహిళా ఓటర్లు, 10 మంది థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,38,933 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 50 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నారు. కైకలూరు నియోజకవర్గంలో 1,01,297 మంది పురుష ఓటర్లు, 1,04,513 మంది మహిళా ఓటర్లు, ఐదుగురు థర్డ్ జెండర్ ఓటర్లు కలిపి మొత్తం 2,05,815 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మరో 79 మంది సర్వీసు ఓటర్లుగా ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

శతవసంతాల చరిత్ర తిరగరాసేలా ఫలితాలుండాలి

ఉండి హైస్కూల్‌లో మంత్రి నారా లోకేష్
తరగతి గదులు, క్రీడా ప్రాంగణం ప్రారంభం


భీమవరం టౌన్: ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంత్రి లోకేష్

ప్రజాశక్తి - ఉండి

శత వసంతాల చరిత్ర కలిగిన ఉండి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు చరిత్ర తిరగరాసేలా ఫలితాలను సాధించాలని మంత్రి నారా లోకేష్ అన్నారు. దాతల సహకారంతో 107 సంవత్సరాల చరిత్ర కలిగిన ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ స్పీకర్, స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు నేతృత్వాన ఆధునీకరించారు. ఆ పాఠశాలలోని తరగతి గదులను, క్రీడా ప్రాంగణాన్ని మంత్రి లోకేష్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో ముచ్చటిస్తూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు సుమారు రూ.55 లక్షల వ్యయంతో ఆధునీకరించారన్నారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హైస్కూల్ ప్లస్ విద్యా విధానాన్ని రద్దు చేయొద్దని ఇంటర్ విద్యార్థినులు లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన హైస్కూల్ ప్లస్ విధానాన్ని రద్దు చేసే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. ఈ విధానాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా వెళ్తున్నామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మౌలిక సౌకర్యాల త్రీస్టార్ రేటింగ్ కలిగి ఉందని, చదువు విషయంలో వన్‌స్టార్‌కే పరిమితమైందని, పాఠశాలలో ఉత్తీర్ణతా శాతం పెరగాలని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేస్తేనే మెరుగైన ఫలితాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎంఎల్ఎలు కామినేని శ్రీనివాస్, బడేటి చంటి, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండి : హైస్కూల్ తరగతి గదులు ప్రారంభిస్తున్న మంత్రి లోకేష్

కాళ్ల: పెదఅమిరంలో క్షేత్రీయులు, ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా విగ్రహాన్ని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. రతన్‌టాటా మార్గ్‌గా నామకరణం చేసిన భీమవరం-ఉండి రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టాటా కంపెనీ పేరు వినగానే ఒక గౌరవం, ఒక ఆదరణ, ఒక నమ్మకం కలుగుతుందన్నారు. కోట్లాది మంది విశ్వాసాన్ని పొందడం, దాన్ని దశాబ్దాలుగా కొనసాగించడం చిన్న విషయం కాదన్నారు. టాటా గ్రూపును సాల్ట్ నుంచి సాఫ్ట్‌వేర్ వరకు తీసుకెళ్లి లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. అహర్నిశలు దేశం గురించి ఆలోచించిన రతన్‌టాటా విగ్రహం పెట్టిన రఘురామ కృష్ణంరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, ఎపిఎస్‌సిసిఎస్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, ఎంఎల్ఎలు పితాని వెంకటేశ్వర్లు, బొలిశెట్టి శ్రీనివాస్, ఎం.ధర్మరాజు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి, డిఇఒ ఇ.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: స్థానిక ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం ఆర్థిక సహకారంతో పెదఅమిరం గ్రామ పంచాయతీలో రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఫిల్టర్ బెడ్‌ను మంత్రి నారా లోకేష్ కళాశాల ప్రాంగణం నుండి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా ప్రగతితో పాటు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన సభలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల తరఫున కళాశాల అధ్యక్ష కార్యదర్శులు సాగి ప్రసాదరాజు, సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ మంత్రి లోకేష్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు ఎస్.వి.రంగరాజు, డైరెక్టర్ సాగి సత్యవర్మ, డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళీకృష్ణంరాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ప్రజా సమస్యలు పరిష్కరించాలి

డిఆర్ఒ వెంకటేశ్వర్లు

వినతులు స్వీకరిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 142 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. ప్రతి అర్జీకి సరైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని, ప్రతి అర్జీని ఆడిటింగ్ చేస్తారని తెలిపారు. ప్రజల నుండి అందే ప్రతి అర్జీనీ త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీ పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి

పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్


తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తణుకు

డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయాలని ఉందుర్తి పాల్ ఫౌండేషన్ సభ్యులు అడ్డగర్ల అజయకుమారి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉందుర్తి పాల్ ఫౌండేషన్, సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ అశోక వర్మకి వినతిపత్రాన్ని అందజేశారు. యానాదులకు ఆధార్, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని, ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇవ్వాలని, యానాదులు పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్, ప్రసన్నకుమార్‌లు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న యానాదులు పట్టణంలో ఉన్నప్పటికీ సమాజానికి చాలా దూరంగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యానాదులు అమాయకత్వం అడ్డు పెట్టుకుని కొంత మంది క్యాష్ చేసుకుంటున్నారని అన్నారు. 70 కుటుంబాలు యానాదులు ఉంటే 20 మందికి మాత్రమే గతంలో ఆధార్ కార్డులు వచ్చాయని తెలిపారు. ఆధార్ కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వం అందించే ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. యానాదులు పిల్లల్లో కూడా కొంత మంది స్కూల్‌కి వెళ్లకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని అన్నారు. వైద్యం కూడా అందక చాలా బాధపడుతున్నారని తెలిపారు. నేటికీ డంపింగ్ యార్డ్ వద్ద ఎలాంటి రక్షణ లేని ప్రదేశంలో జీవనం సాగించడం బాధాకరమన్నారు. కొంత మందికి డబ్బులు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ అశోకవర్మ మాట్లాడుతూ యానాదులు ఆధార్ కార్డులు అందించి, వాళ్లని ఇబ్బందిపెడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి, జోహాన్స్ పాల్, అభిషేక్ బోస్, బన్నీ, పండు, నాగరాజు, సత్తి ఆనంద్, వెంకటేశులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

జంప్ చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జరుగుతున్నాయి. నగరంలోని జిల్లా పోలీసు మైదానంలో గత పది రోజులుగా పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు నిర్వహించారు. టెస్టుల్లో భాగంగా 600 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు మంజూరు చేయగా వారిలో 396 మంది ఈ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులకు హాజరయ్యారు. వారిలో 253 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ ఫిజికల్ టెస్టులు మరో మూడు రోజులు నిర్వహించనున్నారు. అనివార్య కారణాలవల్ల ఈ ఫిజికల్ టెస్టులకు హాజరుకాని అభ్యర్థులు ఎవరైనా ఉంటే వారు ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించే పరీక్షలకు హాజరై ఫిజికల్ టెస్టులు నిర్వహించుకోవాలని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

దేహదారుఢ్య పరీక్షల్లో కానిస్టేబుల్ అభ్యర్థులు



అన్నే వెంకటేశ్వరరావు, అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదర్శప్రాయులు అన్నే వెంకటేశ్వరరావు

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఆదర్శప్రాయులు అన్నే వెంకటేశ్వరరావు అని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అన్నారు. మెంటేవారితోటలోని సిపిఎం కార్యాలయం వద్ద సోమవారం అమరజీవి, స్వాతంత్ర సమరయోధుడు రైతు-ప్రజా ఉద్యమ నేత అన్నే వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో సిపిఎం సీనియర్ నాయకులు, ఏలూరు తాలూకా, ఇతర ప్రాంతాల్లో సిపిఎం నిర్మాత, ఈ జిల్లాలో రైతు, వ్యవసాయ కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రధాన పాత్ర వెంకటేశ్వరరావు పోషించారన్నారు. స్వాతంత్ర సమరయోధుల్లో ఒకరని తెలిపారు. ఆయన జీవిత భాగస్వామి అన్నే అనసూయమ్మ కూడా జిల్లాలో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. వీరిరువురూ ఆదర్శదంపతులు, మచ్చలేని నాయకులుగా, నిస్వార్థంగా జీవించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్మించడంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి, ఏలూరు తాలూకాలో భూ ఉద్యమాన్ని నిర్మించడంలో కీలక భూమికను పోషించారన్నారు. వారి ఉద్యమం ఫలితంగానే వేలాది మంది పేదలు భూములు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.క్రాంతిబాబు, కార్యకర్తలు చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, రత్నకుమారి, నాగరాజు, బత్తుల విజయ్ పాల్గొన్నారు.

రహదారిపైనే దహన సంస్కారాలు

రోడ్డుపై దహనసంస్కారాలు చేస్తున కుటుంబీకులు

ఉండి: ఉండి గ్రామంలోని హిందూ శ్మశాన వాటికకు వెళ్లేందుకు అడ్డంగా డంపింగ్ యార్డ్ ఉండడంతో ఆగ్రహించిన బంధువులు మృతదేహానికి రోడ్డుపైనే దహన సంస్కారాలు చేశారు. సోమవారం స్థానిక ఇసుక దొడ్డిపేటకు చెందిన పెంకి గణేష్ అనే యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. దహన సంస్కారాల నిమిత్తం డంపింగ్ యార్డులోని చెత్త శ్మశాన వాటికకు వెళ్లేందుకు దారులో అడ్డంగా ఉందని గ్రామపంచాయతీ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించి దారి ఇప్పించాలని అడగగా వారు స్పందించలేదు. దీంతో ఆగ్రహించిన బంధువులు మృతదేహానికి రోడ్డుపైనే దహన సంస్కారాలు నిర్వహించారు. దీంతో ఉప్పుగుంట వాసులు అందరూ నడిరోడ్డుపైన బైఠాయించారు. సంఘటనా స్థలానికి ఉండి తహశీల్దార్ కె.నాగార్జున చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడారు. మర్నిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రజలు నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ

ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలి

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా ఫిర్యా దులను వెంటనే పరిష్కరించాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అధికారులను ఆదేశించారు. నరసాపురం సబ్ కలెక్టరేట్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 29 ఫిర్యాదులు వచ్చాయని ఆర్‌డిఒ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో రెండు వినతులు వచ్చాయని తహశీల్దార్ కె.రాజకిషోర్ తెలిపారు. మూడు సమస్యల పరిష్కారం కోరుతూ ఒకటి, కొడుకు చూడట్లేదు అంటూ ఒక వినతి వచ్చాయని తహశీల్దార్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

1998 డిఎస్‌సి ఎంటిఎస్ టీచర్ల సంఘం నాయకులు సోమవారం మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. నారా లోకేష్ ఉండి, భీమవరం పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ ఇంటికి వచ్చిన లోకేష్‌ను టీచర్స్ కలిసి తమ సమస్యని పరిశీలించాలని కోరారు. అన్ని అర్హతలు ఉండి రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3,500 మంది రూ.32,470 వేతనంతో కాంట్రాక్ట్ టీచర్స్‌గా పనిచేస్తున్నామన్నారు. వయోపరిమితి దాటి ఉద్యోగవిరమణ చేస్తున్న మాకు సంవత్సరానికి 11 నెలలకు మాత్రమే జీతం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని లోకేష్‌ను కోరారు. ఆయన స్పందించి సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చారని యూనియన్ రాష్ట్ర కన్వీనర్ వై.సుబ్బారాయుడు తెలిపారు.

ముద్దాయిలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి విజయదుర్గ

ఉప కారాగారం సందర్శన

ప్రజాశక్తి - నరసాపురం

ఉమ్మడి జిల్లాల న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ సోమవారం సాయంత్రం నరసాపురం ఉప కారాగారాన్ని సందర్శించారు. జైల్ ముద్దాయిలకు సంబంధిత పోలీస్ వారి నుంచి తదుపరి వాయిదాలు తెలుస్తున్నది లేనిదీ, ఉచిత న్యాయ సలహాదారులు పనితీరును, ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ సభ్యుల పనితీరును సబ్ జైల్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాలను ముద్దాయిలకు అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాదారులు జైల్ ముద్దాయిలకు అందించే న్యాయ సహాయంపై ఆరా తీశారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జైల్ ముద్దాయిలకు నియమించబడిన ఉచిత న్యాయ సలహాదారులందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. వంటశాల, స్టోర్ రూంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప కారాగారం పర్యవేక్షణాధికారి టి.అప్పారావు, జైల్ సిబ్బంది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ వెంకటేశ్వరరావు, కె.చిట్టి పద్మజ, జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు

ప్రజాశక్తి - గణపవరం

రోడ్లపైనున్న వీధి కుక్కలు

మండల కేంద్రం గణపవరంలో చెలరేగిపోతున్న వీధి కుక్కలను నివారించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ కనపడిన వారిపై దాడి చేసి కరవటం వల్ల స్థానికులు బయట తిరగడానికి భయపడుతున్నారు. ఇటీవల గాంధీనగర్లో వీధి కుక్కలు పది మందిని కరిచినట్లు గాంధీనగర్ వాసులు చెప్పారు. కుక్కలను నివారించడంలో అధికారులు పట్టించుకోకపోవటం వల్ల అవి చెలరేగిపోతున్నాయని స్థానికులు అంటున్నారు. కుక్కలను నివారించాలని సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు గణపవరం ప్రాంతంలో కుక్కలను నివారించే ప్రయత్నం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - మొగల్తూరు

రహదారి ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముత్యాలపల్లి గ్రామానికి చెందిన గుడాల ఆదిలక్ష్మి(63) గ్రామంలో 216 జాతీయ రహదారి ఒకవైపు నుంచి రెండో వైపునకు వెళుతుండగా మొగల్తూరు వైపు నుంచి కాళీపట్నం వైపు వెళ్తున్న కాంక్రీట్ మిక్సింగ్ వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆమె సంఘటనా ప్రాంతంలోనే మృతిచెందారు. సంఘటనకు సంబంధించి ఆమె కుమారుడు మహాలక్ష్మిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వాసు తెలిపారు.

రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందిన సంఘటనపై సోమవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన బెల్లంకొండ సత్యనారాయణ(52) ఆదివారం రాత్రి నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో సంఘటన ప్రాంతంలోనే సత్యనారాయణ మృతి చెందారు. ఆయన కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులో జరిగిన రహదారి ప్రమాదంలో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీనికి సంబంధించి 108 అత్యవసర వాహన సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరులోని కోతులగుంట ప్రాంతంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఆదివారం రాత్రి ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ముత్యాలపల్లి గ్రామానికి చెందిన వంశి, గగన్ నరసాపురం కొండపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న అత్యవసరవాని సిబ్బంది బాధితులను నరసాపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుని సూచన మేరకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్న) బాధితులను ఆస్పత్రిలో చేర్పించి సహకారం అందించారు. సంఘటనకు సంబంధించి ఇంకా సమాచారం అందలేదని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్చాలి

మెరుగైన వైద్య సేవల కోసం ఇతర ప్రాంతాలకు..

అవస్థలు పడుతున్న రోగులు

స్థానిక ఎంఎల్ఎ, ప్రజాప్రతినిధులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిహెచ్‌సిగా మార్పు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం 24 గంటలూ అందించవలసిన అవసరం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం మండలంలో గణపవరం, పిప్పర గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ ఆ కేంద్రాల ద్వారా అవుట్ పేషెంట్‌లకు మాత్రమే ప్రాథమిక చికిత్స నిర్వహిస్తున్నారు. మెరుగైన వైద్యం కావాలంటే తాడేపల్లిగూడెం, ఏలూరులో ఉన్న ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేయటం తప్ప స్థానిక ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలతో పాటు రోగికి వచ్చిన రోగనిర్ధారణ చేసే వైద్యుడు లేడు. దీంతో ప్రజలు మెరుగైన వైద్యం కోసం తాడేపల్లిగూడెం, ఏలూరు వెళ్లక తప్పటం లేదు. గణపవరంలో ఉన్న పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మార్పు చేయాలని, దీంతో పాటు 50 పడకలు ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులతో పాటు స్థానికులు ప్రభుత్వాన్ని కోరినా ఇప్పటి వరకూ సిహెచ్‌సి ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గణపవరంలో సిహెచ్‌సి ఏర్పాటు చేస్తే గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన ప్రజలకే కాకుండా ఉండి మండలంలో ఉన్న ఆరేడు, కలిగోట్ల, కోలమూరు గ్రామ ప్రజలకు వైద్యసౌకర్యం అందుతుంది.

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సిహెచ్‌సిని ఏర్పాటు చేయడానికి రెండు సంవత్సరాల క్రితమే ప్రతిపాదనలు పంపించామని స్థానిక వైద్యాధికారులు చెప్పారు. అయితే సిహెచ్‌సి ఏర్పాటుకు ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోదని, ఒక ఎకరం స్థలం కావాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజుకి విషయం చెప్పినట్లు తెలిపారు. సిహెచ్‌సి ఏర్పాటుకు కావలసిన ఎకరం భూమిని దాతల ద్వారా అడిగి ఏర్పాటు చేస్తామని, దీంతో పాటు 50 పడకలు కూడా ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పినట్లు తెలిపారు. ప్రస్తుతం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతిరోజు అవుట్(ఒపి) పేషెంట్‌ల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. వచ్చిన వారందరికీ వైద్యం అందిస్తున్నామన్నారు. గణపవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిహెచ్‌సిగా మార్పుచేస్తే ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. స్థానిక ఎంఎల్ఎ ధర్మరాజు, ప్రజాప్రతినిధులు సిహెచ్‌సి ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అద్దేపల్లి జీవితం అందరికీ ఆదర్శనీయం

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు భరత్, నిమ్మల

ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా 125వ జయంత్యుత్సవాల ముగింపు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వాతంత్ర సమరయోధునిగా, విద్యాదాతగా, సేవామూర్తిగా, అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ఆదర్శనీయులని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు డాక్టర్ నిమ్మల రామానాయుడు, టిజి.భరత్, సినీ సంగీత దర్శకులు ఆర్‌పి.పట్నాయక్‌లు అన్నారు. ఆదివారం రాత్రి పాలకొల్లులో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లి జయంతి వేడుకలను ప్రతినెల ఏడాది పాటు మంత్రి రామానాయుడు నిర్వహించిన సందర్భంగా జరిగిన ముగింపు సభలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా అద్దేపల్లి వారి సత్రం సెంటర్లో గల అద్దేపల్లి విగ్రహానికి, చిత్రపటానికి కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేకును కోసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరమును మంత్రి టిజి.భరత్ ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన మంత్రి రామానాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధునిగా, విద్యాదాతగా, సేవామూర్తిగా అద్దేపల్లి అందరికీ ఆదర్శనీయులని అటువంటి మహనీయుని చరిత్రను భావితరాలతో పాటు భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతోనే ఏడాది పాటు జయంతోత్సవ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఆంగ్లేయుల పాలనలో అప్పటి మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్నప్పటికీ పదవి గండం ఉంటుందని తెలిసిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా తీర్మానం చేసిన పోరాటయోధుడు అద్దేపల్లి అన్నారు. నేడు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో మన పిల్లలు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు అంటే ఆనాడు కళాశాలల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని, సొంత రైసు మిల్లు అమ్మి విరాళం ఇచ్చిన దానకర్ణుడని మంత్రి రామానాయుడు అభివర్ణించారు. దాతృత్వంతో పాటు సేవా కార్యక్రమాల్లోనూ పాలకొల్లులోని ఆర్యవైశ్యులు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ముఖ్య అతిథి, సభా ప్రారంభకులు మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ ఇటువంటి గొప్ప వ్యక్తుల చరిత్రలను పిల్లలకు తెలిసేలా ప్రతి తల్లిదండ్రులు తెలపాలన్నారు. అద్దేపల్లిని ఆదర్శంగా తీసుకుని ప్రతిఒక్కరూ తమకున్న స్థోమతను బట్టి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ప్రజల కష్టసుఖాల్లో మమేకమై పనిచేసే రామానాయుడుకు ప్రజల నాడి తెలుసునని, ఆయనే రియల్ హీరో అని మంత్రి భరత్ పేర్కొన్నారు. అటు ప్రభుత్వపరంగా, పార్టీ పరంగా చేసే కార్యక్రమాల్లో ఆయన్ని అనుసరించడం ఎవరివల్లా సాధ్యం కాదన్నారు. మరో ముఖ్యఅతిథి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ అద్దేపల్లిని స్ఫూర్తిగా తీసుకుంటూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలన్నారు. గొప్ప వ్యక్తి అద్దేపల్లి చరిత్రను విస్తృతపరిచేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించిన మంత్రి రామానాయుడుని ప్రత్యేకంగా అభినందించారు. సినీ సంగీత దర్శకులు ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ అద్దేపల్లి జయంతి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి రామానాయుడును చూడాలనే ఈ కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. అందుకు గల కారణం వివరిస్తూ ఎన్నికల ముందు తన స్నేహితుడు ఎప్పుడు జనంతో ఉంటారు, ఇంటికి వెళ్లినా, వెళ్లకపోయినా జనంతోనే గడుపుతుంటారు. ఎవరు గెలిచినా, గెలవకపోయినా ఆయన గెలుస్తారంటూ చెప్పాడు. ఆ తర్వాత రామానాయుడు చేసే మంచి కార్యక్రమాలు కూడా తెలుసుకొని ఎప్పుడైనా చూడాలి అనుకున్నాను. ఇలా నెరవేరిందన్నారు. సభలో మంత్రులు శ్రీనివాస్ వర్మ, భరత్, ఆర్‌పి పట్నాయక్‌లను మంత్రి రామానాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, మాజీ ఎంఎల్ఎ బంగారు ఉషారాణి, జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ ఛైర్మన్ గవర ఉదయ శ్రీనివాసు(బన్నివాసు), బిజెపి కృష్ణాజిల్లా ఇన్‌ఛార్జి ఉన్నమట్ల కబర్ధి, ఎపి ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకటరత్న నరసింహారావు, నాయకులు గండేటి వెంకటేశ్వర రావు, బోణం చినబాబు, యర్రంశెట్టి పద్మారావు, అద్దేపల్లి మనవళ్లు బాలగంగాధర్(బాలు), మోహన్ దాస్, నాళం వెంకట సోమేశ్వర బాపిరాజు పాల్గొన్నారు.


అద్దేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి నిమ్మల, నేతలు


బాలోత్సవంలో సాధించిన బహుమతులతో విద్యార్థులు

బాలోత్సవ విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - కాళ్ల

కోపల్లె హైస్కూల్ విద్యార్థులు భీమవరం బాలోత్సవంలో ఉత్తమ ప్రతిభ కనబరచి బహుమతులు సాధించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు కె.నిర్మలాదేవి అన్నారు. కోపల్లె హైస్కూల్లో విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విషయాల్లో చురుకుగా పాల్గొంటూ పాఠశాలకు మంచి పేరు తెచ్చారన్నారు. బాలోత్సవంలో సీనియర్స్ ఫోక్ డాన్స్‌లో విజేతలుగా నిలిచిన ఎన్.సునీత, కావ్య, వరలక్ష్మి, బాల త్రిపుర సుందరి, యశస్విని, కుసుమ, ధనలక్ష్మి, జయశ్రీ, దేవి ప్రియను అభినందించారు. పద్య పఠనం సీనియర్స్ విభాగంలో ఎస్.లిఖిత దుర్గ, జూనియర్స్ డ్రాయింగ్‌లో యామిని దుర్గశ్రీ, జూనియర్స్ ఎస్సై రైటింగ్‌లో ఎం.మహాలక్ష్మి విజయం సాధించారన్నారు. విద్యార్థులకు డ్రాయింగ్, డాన్స్, పాటలు నేర్పించిన శిక్షకులు శ్రీనివాసాచారి, సత్యలక్ష్మి టీచర్‌కి, ఫస్ట్ అసిస్టెంట్ కె.సుబ్బరాజు, టిఎన్‌విఎ వరలక్ష్మి, స్టాఫ్ సెక్రటరీ మాణిక్యాలరావు, సిబ్బందులకు అభినందనలు తెలియజేశారు.

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించండి

ఆక్వా రైతు రుద్రరాజు సూర్యనారాయణ రాజు

ప్రజాశక్తి - ఉండి


మంత్రి లోకేష్‌కు వినతిని అందజేస్తున్న ఆక్వా రైతుల సంక్షేమ సంఘం నాయకులు

ఆక్వా రైతులకు యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించాలని మంత్రి నారా లోకేష్‌కు కలిగొట్ల ఎంపిటిసి, ఆక్వా రైతు రుద్రరాజు సూర్యనారాయణ రాజు(యువరాజు), పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రైతుల సంక్షేమ సంఘం నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందించినట్లు యువరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆక్వా రైతులను కేటగిరీలుగా విభజిస్తూ విద్యుత్ సబ్సిడీని నిలుపుదల చేయడంతో ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను పాదయాత్రలో నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి టిడిపి ప్రభుత్వం వస్తే ఆక్వారైతుల సమస్యలు పరిష్కరించి, విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరిస్తామని చెప్పారన్నారు. అదే విషయాన్ని ఉండి పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆక్వారైతుల సమస్యలు తీరుస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణ

ఎపి ఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రఘునాథ బాబు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం : రఘునాథబాబు

2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల(టారిఫ్) ప్రతిపాదనలపై ఈనెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎపి ఇపిడిసిఎల్, సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎ.రఘునాథబాబు తెలిపారు. మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఇఆర్‌సికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక(ఎఆర్ఆర్)పై ఏడు, ఎనిమిది తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్ నుంచి, పదవ తేదీన కర్నూలు ఎపిఇఆర్‌సి కార్యాలయంలో ప్రతీ రోజు ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు నేరుగానూ, రెండు గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినియోగదారులు, అభ్యం తరదారులు తమ అభిప్రాయాలను వెల్లడిం చవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఇఆర్‌సి అధికారులతో పాటు ఆంధ్రప్రదేశ్ ఇంధనశాఖ, ఎపిట్రాన్స్‌కో, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపి సిపిడిసిఎల్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్(ఇన్‌ఛార్జ్) ఠాకూర్ రామ్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అభిప్రాయాలు చెప్పొచ్చు అన్నారు. తమ సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం(ఎస్ఇ ఆఫీస్) భీమవరం, డివిజన్ కార్యాలయం(ఇఇ ఆఫీస్) నరసాపురం, తాడేపల్లిగూడెం(ఇఇ ఆఫీస్) ద్వారా పాల్గొని తమ అభిప్రాయాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేయాలని కోరారు.

నరసాపురం : విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనపై మంగళవారం ఎపిఇఆర్‌సి చేపట్టే ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లా ఇపిడిసిఎల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నరసాపురంలోని ఇఇ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడేందుకు వీలుగా డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ జరుగుతుంది. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వినియోగదారులు ఛార్జీల పెంపుపై తమ అభిప్రాయాలను నేరుగా హెచ్ఎఆర్‌సి ఛైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్‌కు తెలియజేయవచ్చు.


మంత్రి లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొవ్వలి

మంత్రి లోకేష్‌ను కలిసిన కొవ్వలి

నరసాపురం : భీమవరం, ఉండి నియోజకవర్గాలకు విచ్చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను నరసాపురంకు చెందిన టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి నారా లోకేష్‌కు రామ్మోహన్ నాయుడు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించుకున్నారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను కొవ్వలి రామ్మోహన్ నాయుడు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. నియోజవర్గ అభివృద్ధికి విష్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, బర్రె మురళీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : ఆర్‌డిఒ

నరసాపురం : విద్యార్థి దశలోనే లక్ష్యం నిర్దేశించుకొని దాని సాధన కోసం కృషిచేయడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. నరసాపురం రాయపేట బిసి సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆర్‌డిఒ దాసిరాజు సోమవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల వార్డెన్, బాలురలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల గదులు, వంటశాల, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ బాగా చదువుకుని తల్లిదండ్రుల గౌరవాన్ని పెంచాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పక్కన ఉన్న తన బంగ్లాకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేస్తున్న ఆర్‌డిఒ

ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకం గడువు పెంపు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకం గడువు ఈనెల 15వ తేదీ వరకు ప్రభుత్వం పెంచినట్లు వ్యవసాయశాఖ ఎడిఇ డాక్టర్ అనిల్ కుమారి తెలిపారు. సబ్ డివిజన్‌లోని యలమంచిలి, నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని రైతులు ఇంకా ఇన్సూరెన్స్ చెల్లించని పక్షంలో గడువులోపు చెల్లించుకోవాలన్నారు. దీనివల్ల పంటలు నష్టపోయినా, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా పొందేందుకు వీలుంటుందన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ అంజయ్య

సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు మేళా ప్రారంభం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయం వద్ద మెప్మా ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు మేళాను నిర్వహించారు. ఈ మేళాను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ప్రారంభించారు. హెూం ట్రై యాంగిల్ సంస్థ ద్వారా వివిధ రంగాల్లో అనుభవం కలిగిన వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తుందన్నారు. ప్లంబర్స్, కర్పెంటర్స్, ఎసి, వాషింగ్ మిషన్, టివి, గ్రీజర్, మెకానిక్స్, బ్యూటీషన్ తదితర రంగాల్లో శిక్షణ కావాల్సిన అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంఎం మోహన్, సిఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

11 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 11 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి ప్రారంభిస్తారని తెలిపారు. 13వ తేదీ సాయంత్రం సంక్రాంతి సంబరాలతో పాటు బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందన్నారు. ఈ బహుమతి ప్రధానోత్సవంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, సినీ నిర్మాత బన్నీ వాసు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా యర్రంకి సూర్యారావు, చేగొడి అనంత్ శ్రీరామ్, వాకాడ అంజని కుమార్‌లను సన్మానం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈనెల 8 నుంచి 13 వరకు పాలకొల్లు నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి వాలీబాల్ పోటీలు 3 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల అనంతరం 13వ తేదీ సాయంత్రం 6 గంటలకు బహుమతి ప్రధానంతో పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు పాలకొల్లు పట్టణస్థాయి ముగ్గుల పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9వ తేదీన యలమంచిలి మండల స్థాయి పోటీలు, 10న పాలకొల్లు మండల స్థాయి పోటీలు లంకలకోడేరులో, 11న జిన్నూరులో పోడూరు మండల స్థాయి పోటీలు, 13న నియోజకవర్గస్థాయి పోటీలు పాలకొల్లు ఆర్ఎంబి హై స్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు.

సీత పాలిటెక్నిక్ విద్యార్థికి గోల్డ్ మెడల్

భీమవరం టౌన్ : పద్మభూషణ్ డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీకి చెందిన సీతా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థి జి.విష్ణు రాజు హాకీలో గోల్డ్ మెడల్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.రామకృష్ణ రాజు తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి ఇటీవల విశాఖపట్నంలో జరిగిన డిస్ట్రిక్ట్ రోలర్ హాకీ సీనియర్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. కోయంబత్తూర్‌లో జరిగిన నేషనల్ రోలర్ హాకీ సీనియర్ విభాగంలో పాల్గొననున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జిబిఎస్.కుమార్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థిని, సొసైటీ మేనేజ్‌మెంట్, బి.సీతా పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రామకృష్ణ, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్, ఫిజికల్ డైరెక్టర్ జిబిఎస్.కుమార్ రాజు, సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

KANAKADURGA FINAN CE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: -1st ఫ్లోర్, జెడ్‌ల్యాబ్స్ ఎదురు, ఆర్ఆర్‌పేట, ఏలూరు.
- ఏలూరురోడ్డు, లక్ష్మిథియేటర్ ఎదురు, జంగారెడ్డి గూడెం.
-1st ఫ్లోర్, సుబ్బారావుపేట,కమల హాస్పిటల్స్ ఎదురు, తాడేపల్లిగూడెం
-1st ఫ్లోర్, వెంకన్నప్లాజా, కప్పల వెంకన్న సెంటర్, వేల్పూరు రోడ్డు, తణుకు.
-1st ఫ్లోర్, కన్నపురం రోడ్డు, వాసవి కన్యకా పరమేశ్వరి గుడి పక్కన, కొయ్యలగూడెం.
-1st ఫ్లోర్, బస్టాండ్ ఎదురు, దేవరపల్లి
- గ్రౌండ్‌ఫ్లోర్,అక్షరానంద స్కూల్ ఎదురు, ధర్మాజీగూడెం-534462, ఏలూరు జిల్లా.
- 16-225, ఫస్ట్‌ఫ్లోర్, పాతబస్టాండ్ దగ్గర, జివిమాల్ సూపర్ మార్కెట్, మెయిన్‌రోడ్డు, చింతలపూడి. ఫోన్ :9492934845, -DRNO :10-11-5/2 , 1 st Floor, Ganesh Chowk Center , Near Ravindra bharathi school, NIDADHAVOLU
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1754.13 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, , Opp.Zed Labs, R.R.Peta, Eluru- 534 002. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road,
Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager,
p.hemanth kumar-80746-56196